క్లుప్తంగా

వైభవంగా తూములూరులో విగ్రహ ప్రతిష్ఠ



తూములూరు(కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామంలోని అయోధ్యనగర్, ఎస్టీ కాలనీలో శుక్రవారం ఉదయం 11.02 నిముషాలకు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జ్యోతిష్య–వాస్తు పండితులు నారాయణం రాజా గోపాలాచార్యులు చేతులు మీదుగా వేద మంత్రాలు నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గత మూడు రోజుగా అనేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వార్లను ప్రతిష్ఠించారు. ఆలయంలో ప్రతిష్ఠ అనంతరం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి గ్రామంలో మహిళలు, చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో స్వామి వార్లలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు.

వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: అధిక కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన సాయి, వసుంధరలకు పదేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవలి కాలంలో పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మంటూ భర్త శారీరక, మానసిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ మేరకు భార్య ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలి



నెహ్రూనగర్: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కాల జీతం, సంక్రాంతి కానుక మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని ది గుంటూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడిని కలిసి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి తమ సమస్యలను విన్నవించారు. 2023 డిసెంబర్ 26, నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు పారిశుద్ధ్య కార్మికుల నిర్వహించిన సమ్మె కాలానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీతాలు, సంక్రాంతి పండుగ కానుక ఇప్పించాలని కోరారు. స్పందించిన మేయర్ ప్రజారోగ్య అధికారులతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ నిర్దేశించిన విధంగా వేతనం, పండుగ కానుక త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముత్యాలరావు, పి.శ్రీనివాసరావు, వై.ప్రభుదాస్, కె.మరియదాసు, జి.శ్రీనివాసరావు, బాల ప్రసాద్, రెహమాన్, బాషా, నాగరాజు, చంటి, వినోద్, సాయి పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాస్ సేవలు అభినందనీయం



గుంటూరు మెడికల్: జిల్లా లెప్రసీ నిర్మూలన విభాగంలో ఫిజియోథెరపిస్ట్‌గా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కొడాలి శ్రీనివాసు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో పలువురు వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది అతడిని సన్మానించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాసు 35 సంవత్సరాల పాటు జిల్లా లెప్రసీ విభాగంలో కుష్టువ్యాధిగ్రస్తులకు సేవలు అందించటలో ముందు వరసలో నిలబడ్డారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్(నేషనల్ హెల్త్ మిషన్) డాక్టర్ చుక్క రత్న మన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్ఓ అన్నపూర్ణ, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మానాయక్ భుక్యా, లెప్రసీ శాంపిల్ సర్వే యూనిట్ జీఎంఓ డాక్టర్ జయరామకృష్ణ, డాక్టర్ రంగనాథుల రమేష్, జిల్లా కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మికుమారి, నేషనల్ హెల్త్ మిషన్ అకౌంటెంట్ ఆఫీసర్ కృష్ణకుమారి, డెమో జయప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలోని అంశాలను ఆమోదించేందుకు గాను సమావేశం నిర్వహించనున్నారు. సభ్యుల 18 ప్రతిపాదనలు, 12 నగరపాలక సంస్థ ప్రియాంబుల్స్‌ను ఆమోదానికై ప్రత్యేక కౌన్సిల్ జరగనుంది.

ఇలాంటి ఘటనలు దారుణం



ఎన్నో ఆశలతో వైద్య వృత్తిలోకి వస్తున్న మహిళలపై ఇలాంటి ఘటనలు దారుణం. కోల్‌కత్తాలో జరిగిన ఘటన బాధాకరం. శిక్షణ పూర్తి చేసుకుని వైద్యరాలిగా తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలనుకున్న విద్యార్థిని ఆశలు చిదిమేశారు. మహిళా వైద్యుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

–డాక్టర్ కె.కావ్య, సివిల్ అసిస్టెంట్ సర్జన్ సీహెచ్‌సీ, కొల్లిపర

సంరక్షణ సెల్ ఏర్పాటు చేయాలి



మహిళల సంరక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ వైద్యశాలలు, మహిళా హాస్టల్స్‌లో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి రక్షణకు చర్యలు చేపట్టాలి. మహిళలపై అత్యాచారాలు దాడులకు పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించాలి. మహిళా రక్షణలో భాగంగా సంరక్షణ విభాగాలను ఏర్పాటు చేయాలి.

–బి.నాగమణి, నర్స్, సీహెచ్‌సీ, కొల్లిపర

ఆలయాలకు

శ్రావణ శుక్రవారం శోభ



శ్రీసంతానలక్ష్మి అలంకారంలో శ్రీబాలాత్రిపురసుందరి అమ్మవారు



శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం



శ్రీమహాలక్ష్మమ్మ చెట్టు వద్ద అమ్మవారి పూజల్లో మాజీమంత్రి ఆలపాటి

ఆఖరివారం కావడంతో భక్తులతో కిటకిట



శ్రీవిరాట్ విశ్వకర్మ దేవాలయంలో శ్రీకామాక్షి అమ్మవారు



మారీసుపేట అప్పలస్వామి గుడిలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

తెనాలి: శ్రావణ మాసం చివరి శుక్రవారం పట్టణ దేవాలయాలు శోభను సంతరించుకున్నాయి. వివిధ దేవాలయాల్లో విశేష అలంకారాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు సంప్రదాయ దుస్తులో స్వామి, అమ్మవారి దర్శించుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానానికి పరిసర ప్రాంత భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. బోస్ రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మారీసుపేటలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో బాల త్రిపురసుందరీ అమ్మవారికి శ్రావణ శుక్రవారం రోజున శ్రీ సంతానలక్ష్మి అలంకారంచేశారు. గంగానమ్మపేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ పర్వత వర్ధినీ అమ్మవారికి శ్రావణ శుక్రవారం పూజలు ఎంతో ఘనంగా నిర్వహించారు. విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పట్టణ నాజరుపేటలోని ఎనిమిదో వార్డులో శ్రీమహాలక్ష్మమ్మ చెట్టు వద్ద అమ్మవారి ప్రత్యేక పూజల్లో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. టీబీ రోడ్డులోని శ్రీవిరాట్ విశ్వకర్మ దేవస్థానంలో కామాక్షి అమ్మవారికి విశేషపూజలు జరిగాయి.

అప్పలస్వామి గుడిలో చండీ హోమం

పట్టణ మారీసుపేటలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానం (అప్పల స్వామి గుడి)లో భక్తులచే మండపారాధన, గణపతి పూజతోపాటు విశేషమైన చండీ హోమం నిర్వహించారు. అలాగే ప్రదోష వేళ మహిళా భక్తులచే సామూహిక కుంకుమ పూజ జరిపించారు. ఈ పూజ చేసిన మహిళా భక్తులకు దేవస్థానం వారు అమ్మవారి వెండి డాలర్‌ను బహూకరించారు. వెంకటేష్ , ధనశేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు ధర్మకర్తలు కోనపల్లి నారాయణస్వామి, లంక శివానంద్ కుమార్, శివాంజనేయ ప్రసాద్ పర్యవేక్షించారు.

శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో...

రామలింగేశ్వరపేట దేవీచౌక్‌లో గల శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రత్యేక కుంకుమ పూజ, అనంతరం వందమంది సుహాసినులచే విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం పారాయణ జరిగింది. తాడేపల్లి లలితా కామేశ్వరి, ధార సత్యవతి, పాతూరి నిర్మల తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీచే పసుపు కుంకుమ, పండ్లు, తాంబూలం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ శ్రావణమాసంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి ప్రతి మంగళ, శుక్రవారాలు కుంకుమ పూజ, సామూహిక విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామ పారాయణ చక్కగా నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యక్షుడు శివరాం ప్రసాద్, కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకర్ శాస్త్రి, కోశాధికారి, ధారా బాలకృష్ణ, పాతూరి కోదండరాం, దండిభట్ల పూర్ణ భాస్కర్, కొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోమ కాటుతో వ్యాధులు ప్రబలుతాయి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: దోమకాటు వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం, మలేరియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శుక్రవారం దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులన్ని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ దోమల నియంత్రణకు మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇలా చేయడం వలన మీ కుటుంబంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం విషజ్వరాలు, డెంగ్యూవంటి వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. దోమకాటు వలన ఇవి అని సంభవిస్తున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దోమల లార్వాలను నిర్వీర్యం చేస్తే వాటి అభివృద్ధి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, హెచ్‌వి విజయ్‌కుమారి, డ్వాక్రా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి



కొల్లిపర హైస్కూలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ పద్మావతి, సర్పంచ్ రాధిక



మొక్కలు నాటుతున్న నాయకులు

కొల్లిపర: ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 20 గ్రామాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లిపర హైస్కూల్‌లో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపిఆర్డీ పూర్ణ శంకరరావు, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెంలో ..

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రూరల్ మండల గ్రామం జగ్గడిగుంటపాలెంలో శుక్రవారం మొక్కలు నాటారు. దొడ్డక ఆదినారాయణ, కాటం రవికుమార్, గోలి శ్రీనివాసు, అక్కల ప్రసాద్, కటకం యుగంధర్, గ్రామ టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్రియ విద్యాలయ, ఐటీఐ విద్యార్థులతో కలిసి మొక్కల సంరక్షణ ఆవశ్యకతపై ప్రదర్శన నిర్వహించారు.

బీసీ కులవృత్తుల ఉన్నతికి కృషి చేయాలి

మంగళగిరి: కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు బీసీల కుల వృత్తుల ఉన్నతికి కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కార్యాలయంలో మాట్లాడుతూ రజక, నాయీబ్రాహ్మణ, కుమ్మరి, నేత, గీత వంటి సామాజిక సేవా వృత్తులు నిర్వహించే వారికి సహకారం అందించాలన్నారు. వారికి ఆధునిక పరికరాలు అందించడంతోపాటు సబ్సిడీలు ఇచ్చి ఉపాధిని మెరుగుపరచాలని కోరారు.

అభ్యుదయ భావాల ఉద్యమనేత నరసింహారావు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



సంస్మరణ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అభ్యుదయ, వామపక్ష భావాల ఉద్యమనేతగా నరసింహారావు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ సంఘ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పౌర సమాజ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీ నరసింహారావు సంస్మరణ సభను శుక్రవారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య విద్యా సంస్థల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ అధ్యాపక ఉద్యమనేతగానే కాకుండా, వామపక్ష భావజాలంతో పౌర హక్కుల సంఘ నేతగా కడదాకా జీవించిన నరసింహారావు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నమ్మిన ఆశయాల సాధన కోసం జీవితకాలం కృషి చేసిన మహనీయుడని నివాళులర్పించారు. చరిత్ర కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సోమశేఖరరావు చరిత్ర కాంగ్రెస్ ఉద్యమ నిర్మాణంలో దశాబ్దాలుగా నరసింహారావు క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ అధ్యక్షత వహించిన సభలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వైఎస్‌సీ బోస్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, సీఎస్ఆర్ ప్రసాద్, వి.లక్ష్మణరెడ్డి, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు లక్ష్మి, జ్యోతిర్మయి, సుధామయి, నరసింహారావు, అభిమానులు పాల్గొన్నారు.

పండుగలతో సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ



సంప్రదాయ వస్త్రధారణతో హాజరైన విద్యార్థినులతో చక్రనాగ్, కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలో పండుగల రూపంలో ప్రజల్లో ఆరోగ్యం, ఐక్యమత్యం, నాగరికత ఇమిడి ఉన్నాయని తద్వారా సంస్కృతి, సంప్రదాయాలు అనాదిగా పరిఢవిల్లుతున్నాయని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల్లో శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా పూజ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు అచ్చ తెలుగు సంప్రదాయం ఉట్టిపడే విధంగా పట్టు పరికిణీలు, పావడాలు ధరించి సందడి చేశారు. చక్రనాగ్ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ప్రతి ఇంట్లో నిష్ఠగా వరలక్ష్మీ వ్రతాన్ని తప్పనిసరిగా కుటుంబ సమేతంగా జరుపుకోవడం ద్వారా ధనలక్ష్మీ కటాక్ష సిద్ధిని పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

తెలుగులో తీర్పు

మంగళగిరి: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు అచ్చ తెలుగులో తీర్పు వెలువరించి అందరి మన్ననలు పొందారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో లింగాయపాలెంకు చెందిన ప్రశాంత్‌పై ఇసుక చోరీ కేసు నమోదుకాగా కోర్టులో విచారణ జరిగింది. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి తీర్పును తెలుగులో వెలువరించారు.


ఓవరాల్ చాంపియన్ హిందూ ఫార్మసీ కళాశాల



ప్రతిభ చూపిన విద్యార్థులతో జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అంతర్ ఫార్మసీ కళాశాలల ఆటల పోటీల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ 20 ఫార్మసీ కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా, తమ కళాశాల విద్యార్థులు క్యారమ్స్, క్యారమ్స్ మిక్స్‌డ్, అంత్యాక్షరిలలో ప్రథమ స్థానంతో పాటు చెస్, డంషరాడ్స్‌లో తృతీయ స్థానంతో ఓవరాల్ చాంపియన్స్‌గా ఎంపికై ట్రోఫీ, నగదు బహుమతి సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.సీతారామయ్య, ఎ.ప్రత్యూష, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్‌బాబు విద్యార్థులను అభినందించారు.

గేట్ క్వాలిఫై అయితే ప్రభుత్వ ఉద్యోగావకాశాలు



అతిథిని సత్కరిస్తున్న చలపతి ప్రిన్సిపాల్

తాడికొండ: గేట్ పరీక్షల్లో క్వాలిఫై అయితే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, గేట్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీల్లో పీజీ చేసేందుకు అవకాశం ఉందని సంధ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఎండీ రామారావు అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 'గేట్ పరీక్ష విధానం, అవకాశాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గేట్ పరీక్ష విధానం గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, ఆర్ అండ్ డీన్ డాక్టర్ బాలమురళీకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అభినందనీయం

మంగళగిరి: క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఎంతో మందిని ఉన్నత స్థానాలకు చేర్చిన వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో తానూ విద్యనభ్యసించడం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి తెలిపారు. పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల 48వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కళాశాలలో తొలిసారిగా బీఏ , బీకాం కంప్యూటర్ కోర్సులు ప్రారంభించారని పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోనే నియోజకవర్గ స్థాయిలో తొలి డిగ్రీ కళాశాలని గుర్తుచేశారు. క్రమశిక్షణతో విద్యను అందించి ఎంతో మందిని ఉన్నతస్థానాలకు చేర్చడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ గొడవర్తి నాగేశ్వరరావు, కరస్పాండెంట్ గోలి రామ్మోహనరావు, సీకే జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జె. పాండురంగారావు, ప్రెసిడెంగ్ వెనిగళ్ళ తాతారావు, ఇసునూరి చంద్రమోహన్, కమిటీ ప్రతినిధులు డాక్టర్ కొల్లి నాగేశ్వరరావు, దామర్ల నరసింహం,నరసింహమూర్తి, అందే రామ్మోహనరావు, జీబీ ఫ్రాంక్లిన్, నిర్మల కుమారి, ఏటీ రాయుడు పాల్గొన్నారు.